తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |


TELTEL/2022/83842
PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శనివారం 07, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :175 | పేజీలు :4 | వెల. 3/-

# వరంగల్ లో భూమాఫియా అరాచకం



2

- నకిలీ పత్రాలతో సామాన్యులకు 'పంగనామాలు'
- ఖిలా వరంగల్ రెవెన్యూ పరిధిలో రెచ్చిపోతున్న దళారులు..
- ఒకే భూమికి రెండేసి రిజిస్ట్రేషన్లు!
- కోర్టుల చుట్టు తిరుగుతున్న బాధితులు
- భూ అక్రమాలపై పోలీస్ బాస్ నజర్

అంచలంచెలుగా విస్తరిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్న వరంగల్ నగరంలో భూ అక్రమార్కులు పడగ విప్పుతున్నారు. భూమికి పెరిగిన డిమాండ్ ను ఆసరాగా చేసుకుని, అటు ప్రభుత్వ భూములను, ఇటు పట్టా భూములను యథేచ్ఛగా అన్యాక్రాంతం చేస్తున్నారు. ఖిలా వరంగల్ రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్లలో సాగుతున్న ఈ 'భూ దందా' సామాన్య, మధ్యతరగతి ప్రజల కష్టార్జితాన్ని కబళిస్తోంది.విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఉర్సు శివారు, ఖిలా వరంగల్ ప్రాంతాల్లోని విలువైన భూములపై దళారుల కన్ను పడింది. ఒకే భూమిని నకిలీ పత్రాలతో ఒకరికి రిజిస్ట్రేషన్ చేయడం, తిరిగి అదే సర్వే నంబర్ ను మార్చి మరొకరికి అంటగట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది. అండర్ రైల్వే గేట్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్న కొంత మంది రియల్ మాఫియా సభ్యులు, అమాయక కొనుగోలుదారులను నిలువునా ముంచుతున్నారు. ముఖ్యంగా తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎకరాల కొద్దీ భూమిని తప్పడు సర్వే నంబర్లతో విక్రయించి, యజమానులు లేని సమయం చూసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. బట్టుపల్లి, కరీమాబాద్, ఖమ్మం హైవే, మెడికవర్ హాస్పిటల్ వంటి కీలక ప్రాంతాల్లోనూ ఇదే తరహా అక్రమ రిజిస్ట్రేషన్లు సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

— వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం

## బైక్ ను ఢీకొన్న టిప్పర్

హసన్ పర్తి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
స్పాట్ లోనే ఇద్దరు విద్యార్థులు మృతి



మృతి చెందిన సుప్రతిక



మృతి చెందిన అక్షం

04

## అర్హులైన ప్రతి లబ్ధిదారుకు పథకాలు చేరాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మానుకోట ఐడీఓసీ కార్యాలయంలో 99 రోజుల ప్రణాళికపై సదస్సు



04

## స్నేహానికి పట్టాభిషేకం..



- రాజ్యసభ బరిలో 'వేమన్న
- రేవంత్ రెడ్డి నమ్మకానికి ప్రాణం
- దశాబ్దాల అనుబంధానికి దక్కిన గౌరవం
- హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన కేసముద్రం మండల కాంగ్రెస్ శ్రేణులు

ప్రభాత గమనం, కేసముద్రం :

రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ మనుషుల మధ్య ఉండే నమ్మకం, ప్రాణప్రదమైన స్నేహం ఎప్పటికీ విడదీయలేనిది. దానికి సజీవ సాక్ష్యమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వేం నరేందర్ రెడ్డిల అనుబంధం. తెలంగాణ రాజకీయ యవనికపై వీరిద్దరి ప్రయాణం ఒక అద్భుత కావ్యం. కష్టాల్లో తోడుగా, కన్నీళ్లలో నీడగా, ప్రతి అడుగులోనూ ఒకరికొకరు వెన్నుదన్నుగా నిలుస్తూ "స్నేహమంటే ఇదేరా" అని చాటిచెప్పిన ఈ అరుదైన బంధానికి నేడు సమున్నత గౌరవం దక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రాణస్నేహితుడు, రాజకీయ సహచరుడు వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా స్నేహానికి పట్టాభిషేకం చేశారు..



2

శనివారం
07.03.2026
www.prabhataagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# వరంగల్ లో భూమాఫియా అరాచకం



- నకిలీ పత్రాలతో సామాన్యులకు 'పంగనామాలు'
- ఖిలా వరంగల్ రెవెన్యూ పరిధిలో రెచ్చిపోతున్న దళారులు..
- ఒకే భూమికి రెండేసి రిజిస్ట్రేషన్లు!
- కోర్టుల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- భూ అక్రమాలపై పోలీస్ బాస్ నజర్

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం : అంచలంచెలుగా విస్తరిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్న వరంగల్ నగరంలో భూ అక్రమార్కులు పడగ విప్పుతున్నారు. భూమికి పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని, అటు ప్రభుత్వ భూములను, ఇటు పట్టా భూములను యథేచ్ఛగా అన్యాక్రాంతం చేస్తున్నారు. ఖిలా వరంగల్ రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్లలో సాగుతున్న ఈ 'భూ దందా' సామాన్య, మధ్యతరగతి ప్రజల కష్టార్జితాన్ని కబళిస్తోంది.

## నకిలీల మాయాజాలం..

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఉర్సు శివారు, ఖిలా వరంగల్ ప్రాంతాల్లోని విలువైన భూములపై దళారుల కన్ను పడింది. ఒకే భూమిని నకిలీ పత్రాలతో ఒకరికి రిజిస్ట్రేషన్ చేయడం, తిరిగి అదే సర్వే నంబర్‌ను మార్చి మరొకరికి అంటగట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది. అండర్ రైల్వే గేట్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని పని చేస్తున్న కొంతమంది రియల్ మాఫియా సభ్యులు, అమాయక కొనుగోలుదారులను నిలువునా ముంచుతున్నారు. ముఖ్యంగా తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎకరాల కొద్దీ భూమిని తప్పుడు సర్వే నంబర్లతో విక్రయించి, యజమానులు లేని సమయం చూసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. భట్టుపల్లి, కరీమాబాద్, ఖమ్మం హైవే, మెడికవర్ హాస్పిటల్ వంటి కీలక ప్రాంతాల్లోనూ ఇదే తరహా అక్రమ రిజిస్ట్రేషన్లు సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## రాజకీయ ఒత్తిళ్లు.. బెదిరింపులు

మోసపోయామని గ్రహించిన బాధితులు ప్రశ్నిస్తే, దళారులు రాజకీయ అండదండలతో బెదిరింపులకు దిగుతున్నారు. బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించినా, ఏళ్ల తరబడి కేసులు సాగుతూనే ఉండటంతో వారు మానసిక, ఆర్థిక వేదనకు గురవుతున్నారు. అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని కొందరు భూ దళారులపై ఇప్పటికే 10 నుండి 50 వరకు కేసులు నమోదై ఉన్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## రంగంలోకి పోలీస్ బాస్.. నిఘా ముమ్మరం

ఈ భూ అక్రమాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. భూ బాధితుల పక్షాన నిలబడి, కబ్జాదారుల ఆటకట్టించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని (Special Team) ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అధికారులతో కుమ్మక్కై సామాన్యులను రోడ్డున పడేస్తున్న అక్రమార్కుల జాబితాను సిద్ధం చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, గతంలో కేసులు ఉండి మళ్లీ అరాచకాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# బాధిత కుటుంబానికి శ్రీనివాస్ పరామర్శ



కేసముద్రం, మార్చి 6 (ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన కైతోజు స్వర్ణలత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసి వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కన్నెబోయిన సృజ శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నరసింగ వెంకన్న, నల్ల కిరణ్, రేణిగుంట సుధాకర్, గొట్టం సుభాష్, గొట్టం లక్ష్మణ్, ఇమ్రాన్, ఐరొండ్ల అశోక్, వీరన్న, సుమన్, వెంకటేష్, హరీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ వల్లందాసు ఉమారవికి ఘనంగా సన్మానం



కేసముద్రం మార్చి 6(ప్రభాత గమనం): విలేజ్ కేసముద్రం చైతన్య నగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని పదహారవ వార్డు కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి శుక్రవారం నాడు సందర్శించారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రంలోని పలు సమస్యలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కొమ్ము నిర్మల, ప్రధానోపాధ్యాయులు తాళ్లపల్లి రమేష్, జ్యోతి, జయ, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహానికి పట్టాభిషేకం..

- రాజ్యసభ బరిలో 'వేమన్న
- రేవంత్ రెడ్డి నమ్మకానికి ప్రాణం
- దశాబ్దాల అనుబంధానికి దక్కిన గౌరవం
- హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన కేసముద్రం మండల కాంగ్రెస్ శ్రేణులు



**ప్రభాత గమనం, కేసముద్రం :**

రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ మనుషుల మధ్య ఉండే నమ్మకం, ప్రాణప్రదమైన స్నేహం ఎప్పటికీ విడదీయలేనిది. దానికి సజీవ సాక్ష్యమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వేం నరేందర్ రెడ్డిల అనుబంధం. తెలంగాణ రాజకీయ యవనికపై వీరిద్దరి ప్రయాణం ఒక అద్భుత కావ్యం. కష్టాల్లో తోడుగా, కన్నీళ్లలో నీడగా, ప్రతి అడుగులోనూ ఒకరికొకరు వెన్నుదన్నుగా నిలుస్తూ "స్నేహమంటే ఇదేరా" అని చాటిచెప్పిన ఈ అరుదైన బంధానికి నేడు సమున్నత గౌరవం దక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రాణస్నేహితుడు, రాజకీయ సహచరుడు వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా స్నేహానికి పట్టాభిషేకం చేశారు..

## నామినేషన్ వేళ.. సొంతగడ్డపై ఆత్మీయ వేడుక

తెలంగాణ శాసనసభలో రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన సందర్భం ఒక పండుగలా సాగింది. ఎన్నో ఏళ్లుగా విడదీయలేని బంధాన్ని కొనసాగిస్తున్న కేసముద్రం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తమ అభిమాన నాయకుడిని అభినందించేందుకు భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా కేసముద్రం మండలానికి చెందిన నాయకుడు సమ్మిగౌడ్, వేం నరేందర్ రెడ్డిని కలిసి భారత రాజ్యాంగ ప్రతిని అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "వేమన్న రాజ్యాంగబద్ధమైన పదవిలోకి వెళ్లడం మా ప్రాంతానికే గర్వకారణం. పదవులు మనుషులను వెతుక్కుంటూ వస్తాయి అనడానికి నరేందర్ రెడ్డి ఒక ఉదాహరణ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల ఆయన చూపిన అచంచల విశ్వాసానికి, విధేయతకు దక్కిన ప్రతిఫలం ఇది. స్నేహం కోసం ప్రాణమిచ్చే వ్యక్తులు అరుదుగా ఉంటారు, అలాంటి వారిలో వేమన్న ఒకరు. దేశ అత్యున్నత సభలో ఆయన గళం వినిపించడం తెలంగాణకే గౌరవం" అని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నప్పుడు నరేందర్ రెడ్డి ఎలాగైతే వెన్నంటి నిలిచారో, నేడు ముఖ్యమంత్రిగా తన స్నేహితుడికి తగిన గౌరవం ఇచ్చి రాజకీయాల్లో కొత్త చరిత్రను లిఖించారని కేసముద్రం మండల శ్రేణులు కొనియాడుతున్నాయి. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు..

# కలం పట్టిన సైనికుడు..

- గన్ను వదిలి పెన్ను పట్టిన ఎసల్ల సత్యనారాయణ
- పాత్రికేయ రంగంలో దూసుకెళ్తున్న దేశ రక్షకుడు
- కేసముద్రం ప్రెస్ క్లబ్ తొలి అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక

**కేసముద్రం, మార్చి 6 (ప్రభాత గమనం):**

వృత్తి ఏదైనా ప్రవృత్తి సమాజ హితం కోరేదైతే, ఆ వ్యక్తి చేసే ప్రతి పని నలుగురికి ఆదర్శంగా నిలుస్తుంది. సరిహద్దులో తుపాకీ పట్టి దేశాన్ని కాపాడిన ఒక సైనికుడు, ఇప్పుడు సమాజంలోని అక్రమాలను ఎండగట్టేందుకు కలం పట్టడం అభినందనీయం. కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన ఎసల్ల సత్యనారాయణ ప్రస్థానం ఇప్పుడు స్థానిక పాత్రికేయ రంగంలో కొత్త చర్చకు, సరికొత్త ఉత్సాహానికి దారితీసింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఎసల్ల సత్యనారాయణ, సైనిక సేవ అనంతరం పాత్రికేయ రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలను నిగ్గుతేల్చాలనే సంకల్పంతో జర్నలిజంలోకి అడుగుపెట్టిన ఆయన, తాజాగా నూతనంగా ఏర్పాటైన కేసముద్రం ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



## సైనికుడి క్రమశిక్షణ.. జర్నలిస్టుగా నిబద్ధత

సైన్యంలో పనిచేసిన వారికి ఉండే క్రమశిక్షణ, మొక్కవోని ధైర్యం సత్యనారాయణ గారిని ఒక పదునైన పాత్రికేయుడిగా తీర్చిదిద్దాయి. గన్ను వదిలి పెన్ను పట్టిన ఆయన, వార్తా సేకరణలో చూపిస్తున్న వేగం, అన్యాయాలను ప్రశ్నించడంలో ప్రదర్శిస్తున్న నిర్భీతి తోటి జర్నలిస్టులకు స్ఫూర్తినిస్తున్నాయి. కేవలం వార్తలు రాయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటం ఆయన ప్రత్యేకత.

## రెండు దశాబ్దాల నిరీక్షణకు తెర

కేసముద్రం మండలం ఏర్పడి ఇన్నేళ్లవుతున్నా, స్థానికంగా పాత్రికేయులందరినీ ఏకం చేసే ఒక వేదిక (ప్రెస్ క్లబ్) లేకపోవడం పెద్ద లోటుగా ఉండేది. ఈ సంస్కృతికి చరమగీతం పాడాలని కంకణం కట్టుకున్న సత్యనారాయణ, మండలంలోని అన్ని పక్షాల పాత్రికేయ మిత్రులను ఏకతాటిపైకి తెచ్చారు. ఆయన అహర్నిశల కృషి ఫలితంగా ఎట్టకేలకు కేసముద్రం ప్రెస్ క్లబ్ ఆవిర్భవించింది. ఆయన నిబద్ధతను గుర్తించిన పాత్రికేయ బృందం, సత్యనారాయణను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఇది కేవలం ఒక పదవి మాత్రమే కాదు, తోటి జర్నలిస్టుల నమ్మకానికి నిదర్శనంగా నిలిచింది.

## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా..

గత కొన్నేళ్లుగా ప్రముఖ పత్రికలో పని చేస్తూ పలు సంచలనాత్మక కథనాలతో రాజకీయ నాయకుల నిద్ర పోగొట్టిన చరిత్ర సత్యనారాయణది. వృత్తిపరంగా ఎదురయ్యే సవాళ్లలో తోటి జర్నలిస్టులకు అండగా ఉంటూ, అక్రమ కేసులు, అభాండాల నుండి వారిని రక్షించడంలో ఆయన ముందుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు, సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. ప్రజా సమస్యలను వెలికితీస్తూ, అన్యాయాలను ఎండగట్టడంలో కేసముద్రం ప్రెస్ క్లబ్ ఒక నూతన ఒరవడిని సృష్టిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన పాత్రికేయ మిత్రులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# అధ్వాన్నంగా బాత్ రూములు

- తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

గార్ల, మార్చి 6 (ప్రభాత గమనం):
గార్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన బాత్‌రూములు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి నిత్యం వందలాది మంది రైతులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే అక్కడి బాత్‌రూములు శుభ్రంగా లేకపోవడంతో ఉపయోగించడానికి కూడా వీలుకాక దుర్వాసన వేస్తున్నాయని వారు అంటున్నారు.లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ బాత్‌రూములు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన సౌకర్యాలు ఇలా నిర్లక్ష్యానికి గురవడం సరైనదికాదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాత్‌రూములను శుభ్రపరచి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.








# అంతర్ముఖ, ఆనంద, ఆరోగ్య యోగ శిబిరం

కేసముద్రం, మార్చి 6 (ప్రభాత గమనం):
కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఈ నెల 8న అంతర్ముఖ, ఆనంద, ఆరోగ్య యోగ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చిర్ర యాకాంతం గౌడ్, చింతనూరి సతీష్ తెలిపారు. శ్రీ సత్యసాయి ధ్యానమండలి, విజయవాడ ఆధ్వర్యంలో పూజ్యశ్రీ బిక్షమయ్య గురూజీ మార్గదర్శకత్వంలో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకోవడం, అంతర్ముఖ ఆనందాన్ని పొందడం, జీవితాన్ని సానుకూల దృక్పథంతో ముందుకు నడిపించుకోవడం వంటి అంశాలపై సాధన, ఉపన్యాసాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే వారికి జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని తెలిపారు. ఆసక్తి గల భక్తులు, యువత, మహిళలు ముందుగా నమోదు చేసుకుని పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. 9440634729, 9848211290, 9948628072 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# కెంచ రమేష్ కి ఓయూ డాక్టరేట్

- హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు
- అభినందనలు తెలిపిన అధ్యాపకులు

కేసముద్రం మార్చి 6(ప్రభాత గమనం): అకుంఠిత దీక్ష, నిరంతర శ్రమ ఉంటే సామాన్యులు కూడా అసాధారణ విజయాలను సాధించవచ్చని పెనుగొండ గ్రామానికి చెందిన కెంచ రమేష్ నిరూపించారు. పేదరికాన్ని జయించి, పట్టుదలే పెట్టుబడిగా సాగించిన ఆయన విద్యా ప్రస్థానం నేడు ఉన్నత శిఖరానికి చేరింది. భూగర్భ శాస్త్రంలో రమేష్ చేసిన విశేష పరిశోధనకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పామూరు పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న గ్రానైట్ శిలల నిర్మాణం, వాటి రసాయన లక్షణాలు, ఆ ప్రాంత భౌగోళిక స్థితిగతులపై రమేష్ అత్యంత లోతైన పరిశోధనలు చేశారు. ఎఎండి జియో సైంటిస్ట్ డాక్టర్ నాగేంద్ర బాబు, ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల జియాలజీ విభాగం ప్రొఫెసర్ శ్రీను కుంసోత్ ల పర్యవేక్షణలో సాగిన ఈ పరిశోధన, భూగర్భ శాస్త్ర విభాగంలో సరికొత్త విశ్లేషణలను ఆవిష్కరించింది. రమేష్ రూపొందించిన ఈ పరిశోధనా గ్రంథాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం, ఆయనను డాక్టరేట్‌కు అర్హులుగా ప్రకటిస్తూ అధికారికంగా పట్టాను అందజేసింది.మండల కేంద్రంలోని పెనుగొండ గ్రామానికి చెందిన కెంచ బీరయ్య, కొమల దంపతుల ప్రథమ కుమారుడైన రమేష్ విద్యా ప్రయాణం ఎందరో గ్రామీణ విద్యార్థులకు ఆదర్శప్రాయం. ప్రాథమిక విద్యను పెనుగొండ ప్రభుత్వ



పాఠశాలలో అభ్యసించిన రమేష్, అనంతరం జమాండ్లపల్లిలోని విద్యా భారతి గురుకుల పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశారు. వరంగల్‌లోని స్వాంతా విద్యారణ్య జూనియర్ కళాశాల, న్యూ సైన్స్ డిగ్రీ కళాశాలల్లో ఉన్నత విద్యను పూర్తి చేసి, హైదరాబాద్ సైఫాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో పీజీ పట్టా పొందారు. తన కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ, ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతూనే పిహెచ్.డి పూర్తి చేయడం ఆయన పట్టుదలకు నిదర్శనం.ఈ అద్భుత విజయం సాధించిన సందర్భంగా రమేష్ తన విజయానికి సహకరించిన మార్గదర్శకులు డాక్టర్ నాగేంద్ర బాబు, ప్రొఫెసర్ శ్రీను కుంసోత్ లతో పాటు అండగా నిలిచిన తల్లిదండ్రులకు, మిత్రులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో

# భాగస్వాములు కావాలి

## మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీత

కేసముద్రం, మార్చి 6 (ప్రభాత గమనం): పట్టణాలు, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీత పిలుపునిచ్చారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రైతు వేదికలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. పట్టణాల్లో పరిశుభ్రత, శానిటేషన్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రత కాపాడటంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ ప్రణాళికలో భాగంగా వచ్చే 99 రోజులలో పట్టణాభివృద్ధి పనుల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అల్లం రమ, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




## అర్హులైన ప్రతి లబ్ధిదారుకు

# సంక్షేమ పథకాలు చేరాలి

### మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో 99 రోజుల ప్రణాళికపై సదస్సు

మహబూబాబాద్, మార్చి 6 (ప్రభాత గమనం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యేలు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతా ల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన సిబ్బందిని నియమించి సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలను సమర్థంగా వినియోగంలోకి తేవాలని తెలిపారు. మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఫిట్ నెస్ లేని స్కూల్ వాహనాలపై చర్యలు

పాఠశాల వాహనాలు ఫిట్‌నెస్ లేకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని, జీపీఆర్ఎస్ ద్వారా వాహనాల పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. స్లమ్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఎక్కడైనా నిధుల సమస్య ఉంటే వెంటనే నివేదికలు పంపాలని చెప్పారు. అలాగే గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్థితిగతులను వారి సెల్‌ఫోన్లకు సమాచారం అందేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని తెలిపారు.



# "వేం' కు ఘనంగా సన్మానం

కేసముద్రం మార్చి 6(ప్రభాత గమనం): రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డిని శుక్రవారం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా నాయకుడు వేం నరేందర్ రెడ్డి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు వోలం కృష్ణమూర్తి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వోలం మురళీ, వోలం రాజేశ్వర్ రావు, ప్రముఖ విద్యాసంస్థల అధినేత తొనూపునూరి భాస్కర్ ఉన్నారు.

### శుభాకాంక్షలు తెలిపిన బనిశెట్టి వెంకన్న....

వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కదిర సురేందర్, బండారు వెంకన్న, బనిశెట్టి వెంకన్న, లోకేష్, గుంజపొడుగు రాజశేఖర్, బద్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ సారు... జరా దేఖో..!

### తాగునీటిలో మురుగు వాసనపై బకెట్ నీటితో నిరసన

వరంగల్ బ్యూరో, మార్చి 6 (ప్రభాత గమనం): స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటిలో మురుగు నీరు కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ బాధితుడు మున్సిపల్ కార్యాలయంలో బకెట్‌లో నీటిని తీసుకువచ్చి నిరసన వ్యక్తం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గాంధీ బొమ్మ సమీపంలోని 2–9/2 నెంబరు ఇంటి వద్ద నివసిస్తున్న వెలమజల వెంకట్ రెడ్డి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తాగునీటిలో దుర్వాసన వస్తోందని బకెట్‌లో నీటిని తీసుకువచ్చి అధికారులకు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. తాగునీటిలో మురుగు నీరు కలుస్తోందని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు మూడు సార్లు దరఖాస్తులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించాడు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు తాగునీటి పైపుల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపాడు. ఎన్నికల సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పుడు పట్టించుకునే వారు లేరని మండిపడ్డాడు. మున్సిపాలిటీలో సమస్యలపై అధికారుల స్పందన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# 300 కేజీల పట్టిక, 100 కేజీల బెల్లం పట్టివేత

వరంగల్ బ్యూరో, మార్చి 6 (ప్రభాత గమనం): నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ముత్తోజిపేట వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో 300 కిలోల పట్టిక, 100 కిలోల బెల్లం, 5 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు నాటుసారా నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖచ్చితమైన సమాచారంతో ముత్తోజిపేట వద్ద వాహన తనిఖీలు చేపట్టగా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లికి చెందిన బానోతు రాజన్న అలియాస్ టీక్య అనే వ్యక్తి కారులో బెల్లం, పట్టికను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కారును తనిఖీ చేయగా 300 కేజీల పట్టిక, 100 కేజీల బెల్లం, 5 లీటర్ల నాటుసారా, టాటా విస్టా కారు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# బైక్ ను ఢీకొన్న టిప్పర్

### ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

### –హసన్ పర్తి సమీపంలో ఘోర ప్రమాదం




మృతులు అక్రం, ఆకుతోట సుప్రతిక

వరంగల్ బ్యూరో, మార్చి 6 (ప్రభాత గమనం): హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ట్రిపుల్ ఈ థర్డ్ ఇయర్ విద్యార్థులు షేక్ జునాయిడ్ అక్రమ్ (21), ఆకుతోట సుప్రతిక (20)గా గుర్తించారు. శుక్రవారం కళాశాలలో పరీక్షలు రాసిన అనంతరం వీరు మోటార్ వెహికల్‌పై హనుమకొండకు బయలుదేరారు. ఈ క్రమంలో హసన్‌పర్తి చెరువు కట్ట సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎల్కతుర్తి వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద తీవ్రతకు ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అక్రమ్ మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందినవాడు కాగా, సుప్రతిక వరంగల్ ఎల్లమ్మ బజార్‌కు చెందినదిగా సమాచారం. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాలను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra